
మినీకథ

# టెంకాయ దెబ్బ కథ



బులుసు సాంబశిం

ప్రకాసం ప్రెసిడెంటు దేనికంటారా?

శ్రీ శ్రీ శ్రీ నటచోర, నటభ్రష్ట కుప్పేశ్వరరావు గారి ఫాన్స్ ఎసోసియేషన్‌కి ఎదురన్నదే లేక యునానిమస్‌గా ఎన్నికయిన అభ్యర్థి!

ఆరోజు ప్రెసిడెంట్ ప్రకాసం అండ్‌కో చాలా చాలా హడావుడిగా ఉన్నారు. కారణం ఆరోజు వారభిమాన హీరోగారి పిక్చర్ రిలీజు.

"సెక్రటీ"

"వస్తున్నా గురూ..."

"గురూ" అన్న సెక్రటీ సంబోధన ప్రెసిడెంటు ప్రకాసానికి నచ్చదు. ఒకసారన్నా వార్నింగ్ ఇవ్వకపోతే ఇలాగే కంటిన్యూ అవుతాడని మనసులో అనుకొనివాడై, "సెక్రటీ" అని గట్టిగా పిలిచాడు.

"వస్తున్నా గురూ..."పాతాళ భైరవి సినిమాని పద్మనాభం ఫక్కీలో సాగదీసుకుంటూ, పడుతూ లేస్తూ వచ్చాడు సెక్రెటీ. 'నే నెవర్ని?' హుందాగా అడిగాడు ప్రెసిడెంటు ప్రకాసెం.

"ఇదడగటానికా గురూ అంత గట్టిగా పిల్చావ్" నీరసంగా అడిగాడు సెక్రెటీ.

"అవును నేనెవర్ని?" గదమాయిస్తూ రెట్టించి మరీ అడిగాడు ప్రెసిడెంటు ప్రకాసెం.

"ఓస్! నాకామాత్రం తెల్వదనుకున్నవేటి గురూ. నువ్వు నువ్వే...". ఇకిలిస్తూ అన్నాడు సెక్రెటీ.

"వేళాకోళంకాదు చెప్పు నేనెవర్ని?" చెప్పు చెప్పకపోయావా నీతల వేయి చెక్కలవుతుందనే ధోరణిలో బెదిరించాడు ప్రెసిడెంటు ప్రకాసెం.

అయోమయంగా ప్రెసిడెంటు ప్రకాసెం మొహంకేసి చూస్తూ..."శ్రీ శ్రీ శ్రీ నటచోర, నటభ్రష్ట, నట విహీన కుప్పేశ్వరరావుగారి అభిమాన సంఘానికి ఎదురన్నదే లేక యునానిమస్‌గా ఎన్నికయిన ప్రెసిడెంటువి నువ్వే కదు గురూ!" అన్నాడు బళ్ళో పాఠం అప్పచెప్పే కుర్రాళ్ళా బుద్ధిగా చేతులు కట్టుకుని.

"అవునా, కాదా?"

"అందుకు డవుటేటి గురూ!"

"మరి నువ్వు మాకు మర్యాదివ్వాలా లేదా?"

"మరంతే కదు గురూ!"

"ఇకనించి ఆ 'గురు' 'గిరు' అని పిలవటం మానెయ్యాలి. చక్కగా 'ప్రెసిడెంటుగారూ' అని, లేదా 'ప్రెసిడెంటు ప్రకాసెంగారూ' అని పిలవాలి. అండర్‌స్టాండ్?"

"యస్ గురూ... సార్ ప్రెసిడెంటు గారూ..."

"సర్సరి...అన్నీ సిద్ధమేనా?"

"సిద్ధమే గురూ...కాదు ప్రెసిడెంటు గారూ..."

ప్రెసిడెంటు ప్రకాసెం అండ్‌కో అంతా హాల్ దగ్గర చేరారు. ప్రెసిడెంటు ప్రకాసెం తమ సంఘ ఇతర సభ్యుల నుద్దేశించి, "ఫ్రెండ్స్! మన హీరోగారు స్క్రీన్ మీద కనిపించగానే పూలు జల్లి, టెంకాయ కొట్టాలి. తరువాత మన హీరోగారు హీరోయిన్‌తో గంతులు(**steps**) వేస్తున్నప్పుడు మళ్ళీ పూలు జల్లాలి. బుడగలు ఎగరెయ్యాలి. మళ్ళీ మన హీరోగారు భగ్న ప్రేమికుడై బుడ్డీ పట్టుకుని విషాద గీతం ఆలాపిస్తున్నప్పుడు, **climax** సీన్‌లో విలన్‌ని వాడి పరివారాన్ని ఒక్కడే చిత్తు చిత్తుగా తంతున్నప్పుడు, గ్రూప్ ఫోజ్ అప్పుడు పూలు జల్లాలి, బుడగలు వదలాలి. శుభం పడినప్పుడు ఇంకో టెంకాయ కొట్టాలి, చిల్లర పైసలు విరజిమ్మాలి."

"అర్థమైందా?" అని వుపన్యసించాడు.

ఇంతలో గంట మోగింది.

పాలోమంటు హాల్లో జొరబడ్డారు.

ఎవరి సీట్లలో వారు సుఖాసీనులయ్యారు.

తెర రెండు వైపులకి తప్పుకుంది.

ముందర కొన్ని ప్రకటనలు.

తరువాత న్యూస్‌రీలు.

తరువాత ఫిలిమ్స్ డివిజన్ వాళ్ళతో చిన్న డాక్యుమెంటరీ ఫిల్మ్.

ఎట్టకేలకు "కుప్పి గంతులు" పదిహేను రీళ్ళు పడిందా తెర మీద.

తరువాత అరుపులు, కేకల హోరు సంగీతంతో టైటిల్స్, టైటిల్స్ అయిపోయిన అయిదు నిముషాలకి ప్రెసిడెంటు ప్రకాసెం అండ్‌కో వారి అభిమాన హీరోగారు తెరమీద దర్శనం ఇచ్చారు. ప్రెసిడెంటు ప్రకాసెం ఒక్క ఉదుటున కుర్చీమీంచి లేచి, బుట్టలోంచి ఓ టెంకాయ తీసి, బాల్కనీ పిట్టగోడ మీద వీరావేశంతో 'టప్' మనిపించాడు. ఫయ్ ఫయ్ అని ఈలేశారు కుర్రకారు. చప్పట్లు చరిచారు మరి కొందరు. రకరకాలుగా వారి ఆనందాన్ని వ్యక్తపరిచారు.

ఇంతలో ఓ చిప్ప ఎగురుకుంటూ వెళ్ళి నేల క్లాసులోని ఓ బట్టతల మీద 'ధ'మ్మని పడింది. పడీ పడ్డంతోటే దెబ్బకి గుండుకి చీరుకు పోయింది.

"ఎవ్రడా...కొడుకు" అంటూ ఒంటికాలిమీద లేచాడు. ఎడం చేత్తో చీరుకు పోయిన గుండును సవరించుకుంటూ. టెంకాయ నీళ్ళు క్రింద **chair** క్లాసుని అభిషేకం చేశాయి. ఏ పసి గుంటన్న తెలీక వుచ్చ పోసేడేమో అని అనుకుని కుర్చీలోంచి లేచి తలపైకెత్తి నోరు మూసేసుకుని, కళ్ళు చిన్నవి చేసేస్కుని బాల్కనీ

లోకి చూశారు.

హాల్లో కలకలం బయలు దేరింది. ఇంతలో టెంకాయ దెబ్బ తాలూకు మనిషి రొప్పుతూ నేల క్లాసునుంచి బాల్కనీలోకి జనాన్ని తోసుకుంటూ వచ్చి 'ఢ'మ్మని గూబ కదలిపోయేలా ఓటిచ్చుకున్నాడు ప్రెసిడెంటు ప్రకాశానికి. హాలు హాలంతా రయ్యిన తిరుగుతూ ప్రెసిడెంటు ప్రకాశానికి "పూలు జల్లి కొబ్బరికాయ కొట్టడానికి ఇదేమన్న గుడనుకున్నావ్రా లఫంగి... అంటూ ఇంకోటిచ్చు కున్నాడు. దిమ్మ తిరిగి పోయింది ప్రెసిడెంటు ప్రకాశానికి. బిక్కచచ్చిపోయున్నారు అండ్ కో.

సినిమా హీరోగారు ఈ గొడవంతా తనకేమీ పట్టనట్టు ప్రేయసితో ప్రేమ డైలాగులు అప్ప చెపుతున్నారు.

ఇంతలో ఏమైందంటూ ఏమైందంటూ...హాలు మానేజరు, ప్రొప్రయిటరుగారి చిన్నబ్బాయి సాయంతో ఆదరా బాదరాగా వచ్చాడు.

టెంకాయ దెబ్బ తాలూకు మనిషి రెచ్చిపోయాడు. ఇలాటి పోకిరీ వెధవని హాల్లోకి ఎందుకు రానిచ్చావన్నాడు. ఈ బేవార్సు గాళ్ళని పోలీసులకు అప్పచెప్తేగాని తాను శాంతించనని మొరాయించాడు. "అంతపని మాత్రం చెయ్యొద్దు సార్! కావాలంటే మేం వెళ్ళిపోతాం అని

## ఆదర్శం

బుద్బుదాన్ని చూడు
క్షణ జీవితంలో
సప్తవర్ణాలూ
గోచరింప చేస్తుంది
మనిషీ! నీ జీవితకాలంలో
ఏడు రంగులూ చూపలేకపోయినా
నీ కనుపాపలో
ఓ ఎర్రని కాంతిరేఖ
మెరిపించు!

—ప్రయాగ సుబ్రమణ్యం

టెంకాయ దెబ్బ తాలూకు మనిషి కాళ్ళా వేళ్ళా బడ్డాడు ప్రెసిడెంటు ప్రకాశం అండ్ కో.

తిట్టించుకోవడం తప్ప తిట్టడం ఎరుగని మానేజర్ సినిమాల్లో సూర్యకాంతంలాటి ఇంటిదైన పెళ్ళాన్నోసారి గట్టిగా తల్చుకొని ప్రకాశాన్ని అండ్ కోని చెడామడా సంచి దులిపేసినట్టు దులిపేశాడు.

టెంకాయ దెబ్బ తాలుకు మనిషి ఇంక నోటికొచ్చినట్టు తిడుతూనే వున్నాడు ఓ చేత్తో చీరుకుపోయిన గుండును సవరించుకుంటూ.

"గెటౌట్" అని గట్టిగా వంగిపోయి మరీ అరిచాడు మానేజరు.

ప్రెసిడెంటు ప్రకాశానికి హాలింకా రయ్యిన తిరుగుతూండటం మూలాన ఇద్దరు సభ్యుల ప్రెసిడెంటు ప్రకాశం చెరో రెక్క పుచ్చుకుని నెమ్మదిగా నడిపించుకుంటూ తీసుకు వెళ్ళారు. మిగిలిన సభ్యులు ఫాలో అయ్యారు తలకాయ వంచేస్కుని. బాల్కనీ గేటుదాకా వెళ్ళి నెమ్మదిగా తలకాయ వెనక్కి తిప్పి చూశాడు ప్రెసిడెంటు ప్రకాశం. మిగిలిన వారుకూడా అలాగే చేశారు. తెరమీద వారి అభిమాన హీరోగారు గంతులేస్తున్నారు హీరోయిన్‌తో.

టెంకాయ దెబ్బ తాలూకు మనిషి ఇంకా ఎడం చేత్తో గుండు సవరించు కుంటూ కుడిచేత్తో లాల్చీ జేబులోని కొబ్బరి చిప్పని బయటికి లాగి పళ్ళతో పీకుతూ నేల క్లాసులోని తన సీటులోకి వెళ్ళి హీరో హీరోయిన్‌గారేసిన గంతుల్లో నిమగ్నుడయిపోయి చీరుకుపోయిన గుండు సంగతి, కొద్ది నిముషాల క్రితం జరిగిన గొడవ సంగతి ఇట్టే మరచి పోయాడు.

